అభివృద్ధి పనుల్లో జాప్యం వీడాలి

- పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు పూర్తిచేయాలి
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు


పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: అభివృద్ధి పనుల్లో జాప్యం వీడి దుబ్బాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం దుబ్బాక పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం పనులు నత్తనడకన సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం దుబ్బాక నియోజకవర్గంపై పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తే రాష్ట్రమంతా అభివృద్ధి చేసినట్లేనా అని ప్రశ్నించారు. నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయకుండా ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేంతవరకు ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, ఎల్లారెడ్డి, రమణారెడ్డి, ప్రవీణ్, వెంకట్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను నిలిపివేయండి


అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని కొత్త చెరువు శిఖం భూమిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని సోమవారం అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేసినట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ తెలిపారు. శిఖం భూమి సర్వే నంబర్ 644, 645లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. నిర్మాణాలపై ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డూ అదుపులేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. గతంలో ఇలాగే చెరువు శిఖం భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేలాది ట్రిప్పుల మట్టితో కొత్త చెరువును పూడ్చాలని చూస్తే, అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డికి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి మట్టిని తొలగించారని గుర్తు చేశారు. మూడురోజులుగా చేపట్టిన నిర్మాణాలను పూర్తిగా తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లు కలిసి అక్రమ నిర్మాణాలను చూపించారు. కార్యక్రమంలో నాయకులు వనేశ్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి, రాజ్‌కుమార్‌లు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మంత్రులను కలిసిన ఎర్రవల్లి పాలకవర్గం


మంత్రి హరీశ్‌రావుతో ఎర్రవల్లి పాలకవర్గం సభ్యులు

మర్కూక్(గజ్వేల్): సీఎం దత్తత గ్రామమైన ఎర్రవల్లి జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపిక కావడంతో సోమవారం సర్పంచ్ భాగ్యభిక్షపతి, పాలకవర్గ సభ్యులు హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు, దయాకర్‌రావులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి అభివృద్ధి పనుల విషయమై మంత్రిని అడగగా త్వరలో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎర్రవల్లి పాలకవర్గాన్ని మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కనకయ్య, వార్డుసభ్యులు శేఖర్, నవీన్, మల్లేశం, నవీన్‌రెడ్డి, యాదగిరి, పరశురాం, కార్యదర్శి వికాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిద్దిపేటకమాన్: దళితబంధు ప్రవేశపెట్టి దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా సీఎం కృషి చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్ అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితబంధు పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు ఇచ్చి కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 1100 యూనిట్లు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఎల్లం, లక్ష్మణ్, రాజు, కనకయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి హుండీ ఆదాయం రూ.5.11లక్షలు వచ్చినట్లు ఎండోమెంట్ అధికారి రవికుమార్ తెలిపారు. ఆలయ కమిటీ, సర్పంచ్, ఎంపీటీసీల సమక్షంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీవరకు హుండీలో ఉన్న డబ్బులను లెక్కించినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని సంబంధిత బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాము, ఈఓ పీవీ శర్మ, సర్పంచ్ ద్యావనపల్లి మంజుల, చైర్మన్ రాములు, కమిటీ సభ్యులు, ఎండోమెంట్, ఆలయ సిబ్బంది, నాయకులు లక్ష్మణ్, మల్లేశం, రమేశ్, ఓదేలు, నర్సింహారెడ్డి, సునిత, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మా గ్రామాన్ని హుస్నాబాద్‌లో కలపండి'


వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ రమేశ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి గ్రామాన్ని హుస్నాబాద్‌లో విలీనం చేసేంతవరకు ఊరుకోమని, వెంటనే ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరుతూ సోమవారం సర్పంచ్ గద్దల రమేశ్ తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ మండలానికి కూతవేటు దూరంలో మా గ్రామం ఉంటుందన్నారు. దూరంగా ఉన్నటువంటి అక్కన్నపేట మండలంలో కలపడాన్ని తాము మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రామస్తుల కోరిక మేరకు గ్రామాన్ని హుస్నాబాద్ కలపాలని కోరారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెల్ల గ్రామంలో పోచమ్మ ఆలయ పునర్మిర్మాణం, బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలకు సోమవారం గ్రామ సంఘం నాయకులు రూ.1.16లక్షల రూపాయలను సర్పంచ్ గాజుల రమేశ్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు తిరుపతి, రవీందర్, మల్లయ్య, కొమురయ్య, రేణుక, లక్ష్మీ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం


సహపంక్తి భోజనం చేస్తున్న మహిళలు

హుస్నాబాద్: ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ తెలియజేస్తూ విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట స్వరూప కోరారు. రాష్ట్ర మహిళా మోర్చా పిలుపు మేరకు సామాజిక న్యాయ వారోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలోని 12వ వార్డులో మహిళలకు పథకాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మహిళల సాధికారతకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం మహిళా మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి లకావత్ శారద ఇంటిలో ఎస్సీ మహిళలతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కాదాసు దీపిక, మండల అధ్యక్షురాలు కవిత, మాధవి, అంజలి, అనూష, ప్రియాంక, భాగ్య, రూప, స్వాతి తదితరులు ఉన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం


అంబలి పంపిణీ చేస్తున్న వంశీధర్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టి పేదలకు సేవ చేయడమే కేఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు గ్రామాల్లో ఉచిత అంబలి పంపిణీ కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు యూసూఫ్, ఎజాజ్ పటేల్, కొండం రాజు, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే బీజేపీ ధ్యేయం


మగ్దుంపూర్‌లో కరపత్రాలు పంచుతున్న ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

నంగునూరు(సిద్దిపేట): ఆర్థికంగా వెనకబడ్డ బీసీ కులాల సంక్షేమానికి బీజేపీ కృషి చేస్తోందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. సోమవారం ఓబీసీ ఆధ్వర్యంలో మగ్దుంపూర్, రాజగోపాల్‌పేట గ్రామాల్లో పల్లెపల్లెకూ ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. దేశ జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలను ఆర్థికంగా ఆదుకునేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు సత్యం, జిల్లా కార్యదర్శి యాదమల్లు, శ్రీనివాస్, జ్యోతి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌కృష్ణకు సన్మానం


మోహన్‌కృష్ణను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సాంకేతిక విభాగానికి కూరపాటి మోహన్‌కృష్ణ ఎంపిక కావడం సంతోషకరమని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. సోమవారం కౌన్సిలర్లు పులిగారి కల్పనఎల్లం, ఆస యాదగిరిలతో కలిసి దుబ్బాక పట్టణంలోని మోహన్‌కృష్ణ ఇంటికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోహన్‌కృష్ణ ఇస్రోకు ఎంపికై దుబ్బాక పేరును దేశవ్యాప్తంగా గుర్తుంచుకునేలా చేశాడన్నారు. మోహన్‌కృష్ణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ములుగు(గజ్వేల్): పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డిలు అన్నారు. మండలంలోని మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీలో రూ.64లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న రంగాల్లో వైద్యం ఒకటని, మెరుగైన వైద్యం ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, ఎంపీటీసీ లింగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, ఉప సర్పంచ్ సైదయ్య, నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్, కమ్మరి సత్తయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఐలేష్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


కండువాలు కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం దాచారం ఉపసర్పంచ్ మ్యాకల దివ్య, మాజీ సర్పంచ్ గుండారపు రాజయ్య, నాగరాజు తదితరులతో పాటు బెజ్జంకి శివారులోని ఎల్లంపల్లికు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చేరికల కమిటీ కన్వీనర్లు శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, నాయకులు లక్ష్మన్, తిరుపతి, బాలనర్సు, నాగమల్లేశం, శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఐలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య సోమవారం పరిశీలించారు. కంటి పరీక్షల నిర్వహణతో పాటు మెడికల్ వైద్య సిబ్బందికి కావాల్సిన వసతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు నర్సింహులు, స్వామి, సత్తవ్వ, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

నంగునూరు(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. అప్పలాయిచెర్వు గ్రామంలో సోమవారం కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ మల్లవ్వ, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య

దుబ్బాక: రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరితో కలిసి ప్రారంభించారు. గ్రామాల్లో అంధత్వ నివారణకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు తీగుల్ల స్వామి, జనార్దన్, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

జూనియర్ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్యదర్శులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జూనియర్ కార్యదర్శి ఉద్యోగుల ప్రొబేషన్ పీరియడ్ నాలుగు ఏళ్లు పూర్తి కాబోతున్న సందర్భంగా నేటి నుంచి పేస్కేల్ కల్పించి తమను రెగ్యులర్ చేయాలని జూనియర్ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు వేణు అన్నారు. సోమవారం మండల కార్యాలయంలోని నిరసనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులు కీలకపాత్ర వహిస్తున్నారని తెలిపారు. 2018లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్ ద్వారా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్, డిగ్రీ అర్హతతో మూడు సంవత్సరాల ప్రొబేషన్‌తో లక్షల మంది రాసిన పరీక్ష ద్వారా రాష్ట్రంలో 9 వేల మంది ఎంపికయ్యారన్నారు. మూడునెలల నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 12 నుంచి శాతియుతంగా నిరసనలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

బంగ్లావెంకటాపూర్‌లో 'మాక్ అసెంబ్లీ'


విద్యార్థుల 'మాక్ అసెంబ్లీ' దృశ్యం

గజ్వేల్: విద్యార్థుల్లో ప్రజాస్వామిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'మాక్ అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీజ స్పీకర్‌గా, సీఎంగా కీర్తన, ఐటీ మంత్రిగా ప్రవళిక, ఆర్థిక శాఖా మంత్రిగా ఆంజనేయులు, హోంమంత్రిగా భవానీ, విద్యాశాఖా మంత్రిగా అశ్విని‌లు వ్యవహరించారు. మరికొంతమంది ఎమ్మెల్యేలుగా వ్యవహరించి మెప్పించారు. ఈ సందర్భంగా విద్యారంగం, రైతాంగ సమస్యలు, మత్తు పదార్థాల నిషేధం, రోడ్లు, భవనాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ప్లాస్టిక్ నిషేధం, పెట్రో ధరల పెంపు, అడవుల సంరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఎం భూపతిరెడ్డి, ఉపాధ్యాయులు పి.నర్సింలు, సుధాకర్‌రెడ్డి, సంతోష్, సురేష్, స్వప్న, షకీలాపాషాలు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి కలశాభిషేకం


కలశాలలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గ గ్రామంలోని సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో సోమవారం సుబ్రహ్మణ్యస్వామి అష్టోత్తర శత కలశాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో తిరుత్తరణీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అర్చక పండితులు గోపి గురుకుల్, కుమార్ గురుకుల్‌లతో ఉదయం 7 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. యాగశాల నుంచి సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్ వరకు వరకు మంగళ వాయిద్యాలతో వేద మంత్ర పఠనంతో 108 కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.

నిర్వాసితులకు పట్టాల పంపిణీ


పట్టాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ స్వామి

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన 160 ఇళ్లు, మరో 191 ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పట్టా సర్టిఫికెట్లను సర్పంచ్ స్వామి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

నక్షబాటను పునరుద్ధరించాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధి ముస్త్యాల గ్రామంలోని కొమ్ముల మసీదు, పెద్దనూతి తాళ్ల బావి మీదుగా వేముల పోచమ్మ ఆలయం వరకు ఉన్న నక్షబాటను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం బీకేఎంయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్.కే.ఆరిఫాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య మాట్లాడుతూ.. ముస్త్యాల గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం వెలసిన వేముల పోచమ్మ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తూ వెళ్తుంటారన్నారు. పూర్వం నుంచి ఉన్న నక్షబాటను కొంత మంది రైతులు కబ్జా చేస్తూ దారికి ఆటంకం కలిగిస్తున్నారని, వెంటనే సర్వేయర్‌తో కొలతలు వేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేసి బాటను పునరుద్ధరించాలని గ్రామ రైతులు, భక్తుల తరపున తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, సత్తయ్య, బాలయ్య, కొమురయ్య, షాదుల్లా, నజీర్, కిష్టయ్య, పెంటయ్య పాల్గొన్నారు.

పరిహారం అందించి ఆదుకోవాలి


నిరసన తెలుపుతున్న బాధితులు

సిద్దిపేటజోన్: రైల్వే లైన్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి శివార్లలో ప్లాట్లు కొనుగోలు చేశామని, రైల్వే లైన్‌తో భూములు కోల్పోతునఆనమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు సత్తయ్య, శ్రీనివాస్, కమల, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

మిరుదొడ్డి(దుబ్బాక): సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని ఎంపీపీ గజ్జెల సాయిలు అన్నారు. మండల పరిధిలోని చెప్యాలలో సోమవారం అర్హులైన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్యతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, నాయకులు రవీందర్ పాల్గొన్నారు.

◆ నేడు మద్దూరుకు హోంమంత్రి మహమూద్ అలీ రాక

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఖాజా ఆరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం జరిగే ఇఫ్తార్ విందులో మహమూద్‌అలీతో పాటు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, శాసన మండలి మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

◆ ప్రయాణికులకు చల్లని నీరు

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ఆదేశాల మేరకు సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం వేసవి తాపం తీర్చేందుకు ఫ్రిజ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేఖ మాట్లాడుతూ.. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు దాహం తీర్చుకునేందుకు చల్లని తాగునీరు అందిస్తున్నారన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయి సేవా సమితి వారు నిత్యం నీరు సరఫరా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది అలీ తదితరులు పాల్గొన్నారు.

◆ లక్ష్మి కుటుంబాన్ని ఆదుకుంటాం

తొగుట(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెల్దండ లక్ష్మి అంత్యక్రియలు మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో సోమవారం నిర్వహించారు. అంత్యక్రియల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పాల్గొని ఆమె పిల్లలను ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బాధిత కుటుంబానికి ఆయన ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మిస్వామి, ఎంపీటీసీ సుమలతకనకయ్య, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కనకయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

◆ రంజాన్ తోఫాలు అర్హులకే అందించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అర్హులైన నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫాలను అందించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాలకు తంజీమ్ టోకెన్లను కేటాయించడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పేద ముస్లింలు ఎవరనేది వార్డు కౌన్సిలర్లకు తెలుస్తుంది తప్పా తంజీంకు ఎలా తెలుస్తుందన్నారు. టోకెన్ల పంపిణీ నిలిపివేసి ఆయా వార్డుల కౌన్సిలర్లతో రంజాన్ తోఫాలను పేద అర్హులైన ముస్లింలకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, గయాజుద్దీన్, శంకర్, రాములు పాల్గొన్నారు.

దాహం తీరింది

- స్పందించిన అధికారులు
- ఒడ్డెరకాలనీలో వినియోగంలోకి ట్యాంక్

సాక్షి ఎఫెక్ట్..


నల్లా ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళ

కోహెడరూరల్(హుస్నాబాద్): 'తాగునీటికి తండ్లాట..' ఒడ్డెరకాలనీలో అందని మిషన్ భగీరథ నీరు.. శీర్షికతో ఈ నెల 09వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఏఈ ప్రియాంక సోమవారం మండలంలోని సముద్రాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఒడ్డెర కాలనీకి వెళ్లారు. నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌లోకి భగీరథ నీటిని ఎక్కించి నల్లా ద్వారా తాగునీరు సరఫరా చేయించారు. దీంతో ఇంటింటికీ నల్లాలు ఉండడంతో వాళ్ల కష్టాలు తీరాయి. కొన్ని రోజులుగా గుక్కెడు తాగునీటికి పడుతున్న పాట్లపై సాక్షి అధికారుల దృష్టికి తీసుకెళ్లి మా దాహం తీర్చిందంటూ కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.